క్లుప్తంగా

రోడ్డు భద్రతపై అవగాహన అవసరం



బంటుమిల్లి: రోడ్డుపై వాహనాలు నడపడంలో గాని, రాకపోకలు చేసేటప్పుడుగాని భద్రతపై అవగాహన ఉండాలని మచిలీపట్నం మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టరు ఎండీఎల్ సిద్దిక్ అన్నారు. స్థానిక కొమ్మారెడ్డి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో మంగళవారం రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దిక్ మాట్లాడుతూ మైనారిటీ తీరని విద్యార్థులు వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమైతే తల్లిదండ్రులే బాధ్యత వహించాల్సి ఉందని హెచ్చరించారు. రోడ్లపై ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డుల గురించి అవగాహన ఉండాలన్నారు. రోడ్డుపై ప్రమాదాలు జరిగినప్పుడు మనకెందుకులే అని వెళ్లకూడదని సకాలంలో వైద్య సేవలందించి బాధితుల ప్రాణాలు కాపాడితే గుడ్ సమారిథన్ పథకంలో రూ.25వేల నగదు బహుమతిని ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలో విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టరు కె.కిషోర్, కరస్పాండెంట్ కె.శోభ, హెచ్‌ఎం ఎస్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేత హసీమ్ మృతి బాధాకరం

చల్లపల్లి(అవనిగడ్డ): వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ సీనియర్ నేత సయ్యద్ హసీమ్ ఆకస్మిక మరణం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అవనిగడ్డ నియోజకవర్గ సమన్వయకర్త సింహాద్రి రమేష్ బాబు అన్నారు. చల్లపల్లి నారాయణరావు నగర్‌కు చెందిన హసీమ్ మంగళవారం గుండెపోటుతో మరణించారు. సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు హసీమ్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు, ముస్లింలు పాల్గొన్నారు.

కనీస సౌకర్యాలు కల్పించాలని యానాదుల వినతి

శ్రీకాకుళం(ఘంటసాల): ప్రాథమిక అవసరాలైన తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పించాలని కోరుతూ ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామంలోని యానాదులు మంగళవారం పంచాయతీ కార్యదర్శి జి.శ్రీనివాసరావుకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో కె.ముసలయ్య, పోలయ్య, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడులు

కోడూరు: మండలంలోని ఇరాలి సమీపంలో పేకాట శిబిరం జరుగుతుందనే సమాచారంతో బుధవారం దాడి చేసి నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ చాణిక్య తెలిపారు. వారి వద్ద నుంచి రూ.8,720 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఘటనాస్థలంలో ఉన్న నాలుగు ద్విచక్ర వాహనాలను కూడా సీజ్ చేసినట్లు చెప్పారు.

చలో హైదరాబాద్ జయప్రదానికి వినతి

మచిలీపట్నంటౌన్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపులో భాగంగా ఫిబ్రవరి 7వ తేదీన నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పలువురు ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక మల్కా పట్నం గుప్తా సెంటర్లోని భారత మాజీ ఉప ప్రధాని జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద మంగళవారం రాత్రి మాదిగల డప్పు సాంస్కృతిక ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కేవీకేలో ట్రైకోడెర్మా ఉత్పత్తి విధానంపై శిక్షణ

ఘంటసాల: ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం ట్రైకోడెర్మా విరిడి విశిష్టత, వివిధ తెగుళ్ల యాజమాన్యంలో ట్రైకోడెర్మా ప్రాముఖ్యతను కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ కె.రేవతి తెలియజేశారు. ద్రవ, ఘన రూపంలో ట్రైకోడెర్మాను ఉత్పత్తి చేసుకోవచ్చునని, ద్రవ రూపంలో సంవత్సరం, ఘన రూపంలో ఆరు నెలలు నిల్వ చేసుకోవచ్చునని తెలిపారు. అనంతరం ట్రైకోడెర్మా ఉత్పత్తి విధానాన్ని కేవీకే ప్రయోగశాలలో ప్రత్యక్షంగా గ్రామీణ యువతకు చూపించి వారితో చేయించారు.

ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన

బంటుమిల్లి: స్థానిక శ్రీ కనకదుర్గ పిరమిడ్ ధ్యాన ఆధ్యాత్మిక కేంద్రంలో మంగళవారం రాత్రి చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. మౌన ధ్యాన మహాయజ్ఞంలో భాగంగా ఈ నెల 16వ తేదీ నుంచి ధ్యాన శిక్షణ కార్యక్రమాలు కేంద్రంలో జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బంటుమిల్లికి చెందిన పలువురు చిన్నారులు చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో ధ్యాన మాస్టరు పి.వెంకటస్వామి, ధ్యాన గురువులు, పలు ప్రాంతాలకు చెందిన శిక్షకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో అరకొర వసతులు

బుడిబుడి అడుగులు వేస్తున్న చిన్నారులకు బడి గడీలను అలవాటు చేయటానికి, వారి భావి విద్యా జీవితానికి పునాది వేయటానికి ఉద్దేశించినవే అంగన్‌వాడీ కేంద్రాలు... ప్రైవేటు సెక్టార్‌లో ప్రీ స్కూల్ పేరుతో అత్యంత ఆకర్షణీయంగా పెట్టి వేలు, లక్షల్లో ఫీజులు వసూలు చేస్తుంటారు. అయితే సామాన్యులకు అవి అందని ద్రాక్షే... బడుగుల కోసం సర్కారు వారు మంచి ఉద్దేశంతో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో చాలా చోట్ల కనీస వసతులు లేకపోవడం శోచనీయం.

- మరుగుదొడ్లు లేక అవస్థలు
- సొంత భవనాల కోసం ఎదురుచూపులు



టాయిలెట్ సౌకర్యం లేని కృత్తివెన్ను ప్రధాన అంగన్‌వాడీ కేంద్రం

కృత్తివెన్ను: పాఠశాల విద్యకు ముందు చిన్నారులకు పౌష్టికాహారాన్నందిస్తూ, పాఠశాలపై ఆసక్తి కలిగించే అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాల లేమి కనిపిస్తోంది. మండల వ్యాప్తంగా 70 అంగన్‌వాడీ కేంద్రాల్లో దాదాపు 722 మంది చిన్నారులు విద్యనభ్యసిస్తున్నారు. వీరే కాకుండా వీటి ద్వారా గర్భవతులకు, బాలింతలకు ప్రభుత్వం నుంచి పౌష్టికాహారం అందుతుంది. ఇటువంటి అంగన్‌వాడీ కేంద్రాల్లో కొన్నిచోట్ల పూర్తిస్థాయి వసతులు లేవు.

టాయిలెట్లు కొరత...

కృత్తివెన్ను ప్రధాన గ్రామంలోని కృత్తివెన్ను మెయిన్ అంగన్‌వాడీతో పాటు, చినపాండ్రాక మైనారిటీ అంగన్‌వాడీ కేంద్రంలోనూ టాయిలెట్లు లేవు. దీంతో చిన్నారులతో పాటు, అక్కడకు వచ్చే గర్భిణులు, బాలింతలు ఇబ్బంది పడుతున్నారు. ఇవి కాకుండా అద్దె భవనాల్లో నడుస్తున్న చోట కూడా టాయిలెట్లు లేకపోవడంతో అధికారులు, సిబ్బంది తాత్కాలికంగా వాటిని ఏర్పాటు చేసుకున్నారు.

సొంత భవనాల కోసం...

మండలంలోని చినగొల్లపాలెం కాపుటూరు, జానకీపురం, సీపేట, నల్లగంగుల వారి పేట, సానా వారి పేట, నిడమర్రు దళితవాడల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేవు ఇక్కడ అద్దె చెల్లిస్తూ కేంద్రాలను నడుపుతున్నారు. మరో ఎనిమిది చోట్ల లక్ష్మీపురం లాకు, లక్ష్మీపురం దళితవాడ, పల్లెపాలెం–2, ఆముదాలదిబ్బ, చినగొల్లపాలెం పల్లెపాలెం, ఏటిపవర్, మైనవానిలంక, చినగొల్లపాలెంలలో రెంట్ ఫ్రీ భవనాలలో కేంద్రాలు నడుస్తున్నాయి. వీటిని ప్రభుత్వం గుర్తించి సొంతంగా భవనాల నిర్మాణం చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

ఇటీవల ఎనిమిది కేంద్రాలలో టాయిలెట్ల నిర్మాణం జరిగింది. మిగిలిన చోట కూడా టాయిలెట్లు మంజూరయ్యాయి. త్వరలో వీటి నిర్మాణాలు పూర్తిచేస్తాం. రెంట్, రెంట్ ఫ్రీ భవనాలలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాల భవనాల నిర్మాణాల కోసం ప్రతిపాదనలు పంపించాం.

– శ్యామలాగౌరి, రాఘవమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



పెడనలో పాడి రైతులకు ఉచితంగా మందులు అందజేస్తున్న డాక్టర్ అల్తాఫ్ హుస్సేన్



ఘంటసాలలో పెయ్యిదూడల అందాల పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తున్న అధికారులు

పెడన: ఉచిత పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. మండలంలోని కమలాపురం, చేవెంద్ర , ముచ్చర్ల గ్రామాల్లో మంగళవారం ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా 168 పశువులకు వైద్య సేవలను అందించినట్లు వైద్యాధికారి తెలిపారు. 90 పశువులకు నట్టల నివారణ మందు వేశామని, మిగిలిన 78 పశువులకు గర్భకోశ వ్యాధులు, జనరల్ చెకప్ వంటివి చేసి ఉచితంగా మందులను అందజేశామన్నారు. కార్యక్రమంలో కమలాపురం సర్పంచ్ గుడిసేవ శ్రీనివాసరావు, జేఈవో సూరిబాబు, వీపీ రాజేశ్వరరావు, వీఎల్‌వో వెంకటేశ్వరరావు, పాడి రైతులు పాల్గొన్నారు. కమలాపురంలో జరుగుతున్న పశువైద్య శిబిరాన్ని పశుసంవర్థక శాఖ ఏడీ కె.బాబూరావు పరిశీలించి పలు సూచనలు జారీ చేశారు.

నేడు ఉరివి, లంకలకలువగుంటలో...

మండలంలోని ఉరివి, లంకలకలువగుంట గ్రామాల్లో బుధవారం ఉచిత పశువైద్య శిబిరాలను ఏర్పాటు చేశామని, వీటిని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా పశువైద్యాధికారి సూచించారు.

తుమ్మలపాలెంలో పశువైద్య శిబిరం

గూడూరు: మండలంలోని తుమ్మలపాలెంలో మంగళవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని గూడూరు డీసీ చైర్మన్ పోతన స్వామి ప్రారంభించారు. పాడి రైతులందరూ శిబిరం సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గూడూరు వెటర్నరీ డాక్టర్ విజయ్‌కుమార్, తోట వేణు, ఎస్‌ఏ బేగ్, సుంకర మణికంఠ, రాసంశెట్టి శివరావు, రైతులు పాల్గొన్నారు.

చినతుమ్మిడిలో పశువైద్య శిబిరం

బంటుమిల్లి: మండల పరిధిలోని చినతుమ్మిడి గ్రామంలో పశుసంవర్థక శాఖ ఏర్పాటు చేసిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని మంగళవారం ఎంపీపీ వి.చినబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్ఫూర్తి మాట్లాడుతూ వైద్య శిబిరంలో 70 పాడి పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్లకు పలు రకాల వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశామన్నారు. శిబిరంలో గోపాలమిత్ర, సచివాలయ ఉద్యోగులు, రైతులు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

ఘంటసాల: పశువుల ఆరోగ్య శిబిరాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని కృష్ణాజిల్లా పశు సంవర్థక శాఖ అధికారి డాక్టర్ చిన నరసింహులు అన్నారు. ఘంటసాల పశు వైద్యశాల ప్రాంగణంలో వైద్యశాల డాక్టర్ పిన్నమనేని మనోజ్ అధ్యక్షతన జరుగుతున్న పశు ఆరోగ్య శిబిరాన్ని జిల్లా అధికారి డాక్టర్ నరసింహులు, పెయ్యి దూడల అందాల పోటీలను ఆ శాఖ డీడీ డాక్టర్ నాగభూషణరావు మంగళవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా జిల్లా అధికారి చిన నరసింహులు మాట్లాడుతూ నట్టల నివారణ, వ్యాధి నిరోధక టీకాలు, బహు వార్షిక పశు గ్రాసాల సాగు, సంచార పశు ఆరోగ్య సేవ వాహన సేవలు, లింగ నిర్ధారిత వీర్యం, గోకులం షెడ్ల గురించి పశు పోషకులకు వివరించారు. శిబిరంలో భాగంగా ఎదలో ఉన్న పశువులను గుర్తించి కృత్రిమ గర్భధారణ, చూడి పరీక్షలు, తేలికపాటి శస్త్ర చికిత్సలు నిర్వహించారు.

పెయ్యి దూడకు నెక్లెస్, వడ్డాణం



పెయ్యి దూడల అందాల పోటీల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన రావి సుధాకర్ - సుజాత దంపతుల దూడ

ఘంటసాల: ఘంటసాల పశు వైద్యశాల వద్ద మంగళవారం జరిగిన పెయ్యి దూడల అందాల పోటీల్లో గ్రామానికి చెందిన రావి సుధాకర్ – సుజాత దంపతుల దూడ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పెయ్యి దూడకు వడ్డాణం, మెడలో నెక్లెస్, తలకు హ్యాపీ బర్త్‌డే ట్యాగ్ పెట్టడంతో పాటు నాలుగు కాళ్లకు మూడు రంగుల రబ్బరు బ్యాండ్లు తగిలించడంతో చూపరులను ఆకట్టుకోవడంతో పాటు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఆకట్టుకున్న పెయ్యి దూడల అందాల పోటీలు

పశు ఆరోగ్య శిబిరం కార్యక్రమంలో భాగంగా ఘంటసాల పశు వైద్య శాల వద్ద ఏర్పాటు చేసిన పెయ్యి దూడల అందాల పోటీలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ పోటీల్లో సుమారు 25 పెయ్యి దూడలు పాల్గొనగా ఆకుల రాజేష్‌కు చెందిన దూడ ప్రథమ బహుమతి సాధించింది. బండి రాజేంద్రకు చెందిన దూడ ద్వితీయ, రావి సుధాకర్ – సుజాత దంపతుల పెయ్యి దూడ తృతీయ స్థానం సాధించాయి. నాలుగు ఐదు స్థానాలు వేమూరి వీర రాఘవయ్య, వేమూరి హరినాథ్ బాబుల దూడలు సాధించాయి. కార్యక్రమంలో మొవ్వ ఏడీఏ డాక్టర్ దివాకర్, డాక్టర్ మనోజ్, పాలకేంద్రం ప్రెసిడెంట్ గొర్రెపాటి సురేష్, సర్పంచ్ బి.వెంకటేశ్వరమ్మ, శ్రీకాకుళం డీసీ చైర్మన్ అయినపూడి భాను ప్రకాష్, వెటర్నరీ అసిస్టెంట్ ఆర్.మురళీ కృష్ణ, పశువైద్యశాల సిబ్బంది, రైతులు, పశు పోషకులు పాల్గొన్నారు.

పులిగడ్డ ఆక్విడెక్టు అభివృద్ధికి రూ.1.10 కోట్లు

పులిగడ్డ(అవనిగడ్డ): దివిసీమ జీవనాడి పులిగడ్డ ఆక్విడెక్టును రూ.1.10 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ తెలిపారు. అవనిగడ్డ మండలం పులిగడ్డలో ఆర్‌ఎఫ్‌ఆర్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన మూడు నూతన గేట్లను ఎమ్మెల్యే మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫ్లడ్ డామేజ్ రిలీఫ్ ఫండ్ (ఎఫ్‌డీఆర్) నిధులు రూ.18.80 లక్షలతో ఎల్‌ఎఫ్‌ఆర్, ఆర్‌ఎఫ్‌ఆర్, సర్ ప్లస్ ఎస్కేప్‌ల వద్ద మొత్తం 11 నూతన గేట్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. స్టేట్ డిజాస్టర్ మిటిగేషన్ ఫండ్స్ (ఎస్‌డీఎంఎఫ్) నిధులు రూ.1.10 కోట్లతో పులిగడ్డ ఆక్విడెక్టును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు, ఏఈ పొన్నూరు రవితేజ పాల్గొన్నారు.

భూ రీ సర్వేకు సహకరించాలి

ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): శాశ్వత భూ రీ సర్వేకు రైతులు పూర్తిగా సహకరించాలని తహసీల్దార్ శ్రీవిద్య సూచించారు. మండలంలోని ఉత్తర చిరువోలులంక గ్రామంలో భూ రీ సర్వేను తహసీల్దార్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సర్వే వల్ల భూములకు ఎలాంటి సమస్యలు లేకుండా శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఉత్తర చిరువోలులంకలో సుమారు 1,300 ఎకరాలు ఉండగా అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి రీ సర్వే చేపట్టినట్లు వివరించారు. సర్వేయర్ రామకృష్ణబాబు, వీఆర్వో నీల్‌కాంత్, ప్రశాంత్, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.


ఉద్యోగాలకు పెద్ద ఎత్తున దరఖాస్తులు

- 142 పోస్టులకు రెండు వేల దరఖాస్తులు
- రేపటితో ముగియనున్న గడువు


మచిలీపట్నంటౌన్: స్థానిక ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి నర్సింగ్ కళాశాలలో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానించారు. దీంతో ఆయా పోస్టులకు నిరుద్యోగులు పెద్ద ఎత్తున దరఖాస్తు చేస్తున్నారు. మొత్తం 142 పోస్టులకు ఇప్పటివరకు దాదాపు 2 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈనెల 23వ తేదీ గురువారం వరకు దరఖాస్తుకు అవకాశం ఉండడంతో దరఖాస్తుదారులు పెద్ద ఎత్తున తరలివచ్చి దరఖాస్తులు అందజేస్తున్నారు.

మొత్తం 27 రకాల ఉద్యోగాలకు దరఖాస్తులను ఆహ్వానించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 59, సర్వజన ఆస్పత్రిలో 75, నర్సింగ్ కళాశాలలో ఎనిమిది పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానించారు. గురువారం పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చే అవకాశం ఉండటంతో కౌంటర్లను పెంచుతున్నట్లు మెడికల్ కళాశాల కార్యాలయ సూపరింటెండెంట్ లక్ష్మణరావు తెలిపారు.

● ఇదో 'చెత్త' సంపద కేంద్రం



కంచాకోడూరు చెత్త సంపద కేంద్రం దుస్థితి



సంపద కేంద్రంలో వెలవెలబోతున్న ఎరువులు తయారు చేయాల్సిన తొట్టెలు

చెత్త నుంచి సంపద సృష్టించాలన్న బృహత్తర లక్ష్యంతో ప్రభుత్వం గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలకు రూపకల్పన చేసింది. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో ప్రతి గ్రామంలో వీటిని నిర్మించారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో గ్రీన్ అంబాసిడర్ల ద్వారా చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలించాలి. సంపద కేంద్రాలకు వచ్చిన చెత్త నుంచి సేంద్రియ ఎరువులను తయారు చేసి పంచాయతీలకు ఆర్థిక వనరుగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ లక్ష్యం. కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన ఈ కేంద్రాలు రాష్ట్ర ప్రభుత్వ నిర్వహణాలోపం కారణంగా లక్ష్యం నెరవేరడం లేదు. ఫలితంగా చెత్త నుంచి సంపద సృష్టించాల్సిన కేంద్రాలు చెత్త కేంద్రాలుగా నిలిచిపోతున్నాయి. చిత్రంలో కనిపిస్తున్న గూడూరు మండలం కంచాకోడూరులోని సంపద కేంద్రమే దీనికి ప్రత్యక్ష నిదర్శనం. సంపద కేంద్రంలో ఎరువులు తయారు చేయాల్సిన తొట్టెలన్నీ ఖాళీగా వెలవెల బోతుండగా... సంపద కేంద్రం పరిసరాలన్నీ చెత్తాచెదారంతో నిండి దుర్గంధభరితంగా తయారై ప్రజారోగ్యాన్ని కాలరాస్తున్నాయి.

–గూడూరు

దళితులపై అగ్రవర్ణాల దాడులు దారుణం



తూర్పుతెలుగుపాలెంలో బాధిత కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న రామారావు, ఫిలిప్స్ తదితరులు

పెడన: దళితులపై అగ్రవర్ణాలు దాడులు చేయడం దారుణమని, వీటిని తక్షణం నిలువరించకపోతే రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని సీపీఐ మచిలీపట్నం శాఖ సీనియర్ నాయకుడు మోదుమూడి రామారావు అన్నారు. దళిత హక్కుల పోరాట సమితి కృష్ణా జిల్లా కన్వీనర్ లింగం ఫిలిప్‌తో కలిసి ఆయన మంగళవారం పెడన పదో వార్డు తూర్పుతెలుగుపాలెంలో అగ్రవర్ణాల దాడులకు గురైన బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దళితులపై అగ్రవర్ణాల దాడులు ఒక పథకం ప్రకారమే జరుగుతున్నాయనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయన్నారు. గత సంవత్సర కాలం నుంచి పెడన మండలంలోని నాలుగు గ్రామాల దళితులపై దాడులు జరిగినా ప్రభుత్వం, పోలీసులు కఠిన చర్యలు తీసుకోకపోవడంతో అగ్రవర్ణాలకు మరింత ఊతమిస్తోందన్నారు. దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ అట్రాసిటీ కేసు నమోదు చేసి నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చెయ్యాలని డిమాండ్ చేశారు. న్యాయం జరిగేవరకు సీపీఐ బాధిత కుటుంబాలకు అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. ఆయన వెంట పెడన సీపీఐ నాయకుడు కట్టా హేమసుందరరావు తదితరులున్నారు.

దివ్యాంగ పింఛన్ల తనిఖీ



వెంకటాపురంలో దివ్యాంగ పింఛన్లు తనిఖీ చేస్తున్న వైద్య బృందం



శ్రీకాకుళంలో పింఛన్ లబ్ధిదారుల వివరాలు నమోదు చేస్తున్న పెన్షనర్ల తనిఖీ వైద్య బృందం

వెంకటాపురం(మోపిదేవి): ఆంధ్రప్రదేశ్‌లో అర్హతలు లేకుండానే పింఛన్లు అందుకుంటున్న వారిని ఏరివేసేందుకు అధికార యంత్రాంగం రెండురోజుల పాటు తనిఖీలు నిర్వహించింది. మండల పరిధిలోని వెంకటాపురం, ఉత్తర చిరువోలులంక, కోసూరువారిపాలెం గ్రామాల్లో మంగళవారం వైద్య బృందం ఇంటింటా తిరిగి తనిఖీలు చేపట్టారు. దివ్యాంగుల కేటగిరీలో అర్హత లేని వారిని గుర్తించి యాప్‌లో అప్‌లోడ్ చేశారు. మండలంలో దివ్యాంగ పింఛన్లు పొందుతున్న 88 మంది ఇళ్లకువెళ్లి తనిఖీలు నిర్వహించినట్లు ఎంపీడీవో స్వర్ణభారతి తెలిపారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులతో పాటు ప్రత్యేక తనిఖీ బృందం, గ్రామ సచివాలయ అధికారులు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ఘంటసాల మండలంలో...

ఘంటసాల: దివ్యాంగ పింఛన్ల లబ్ధిదారులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు కృష్ణాజిల్లా నుంచి మూడవ వైద్య బృందం మంగళవారం ఘంటసాల మండలంలో పర్యటించింది. ఈ సందర్భంగా ఘంటసాల మండలంలోని చిట్టూర్పులో 5, కొడాలిలో 5, శ్రీకాకుళంలో నలుగురు, చిలకలపూడిలో ఇద్దరు, చినకళ్లేపల్లి, పాపవినాశనం, తాడేపల్లి, ఘంటసాలపాలెం, వి.రుద్రవరం, యండకుదురు గ్రామాల్లో ఒక్కొక్కరు చొప్పున మొత్తం 22 మంది పెన్షనర్లను తనిఖీ బృందంలోని వైద్యులు డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ పూర్ణిమ పరిశీలించారు. ఆయా పెన్షనర్ల సదరం సర్టిఫికెట్, వాడుతున్న మందులు, వైద్య పరీక్షలు చేయించుకున్న పత్రాలు, వారి ఆరోగ్య పరిస్థితులు, ఎన్నాళ్ల నుంచి వ్యాధితో బాధపడుతున్నారు తదితర అంశాలను పెన్షనర్లను అడిగి తెలుసుకుని సంబంధిత వివరాలను దరఖాస్తుల్లో నింపడంతో పాటు యాప్‌లో ఫొటోలు తీసి అప్‌లోడ్ చేశారు. ఘంటసాల ఎంపీడీవో డి.సుబ్బారావు మాట్లాడుతూ ఘంటసాల మండలంలో రూ.15 వేలు పొందుతున్న లబ్ధిదారులు 22 మంది ఉండగా వారిని పెన్షన్ తనఖీ బృందం పరిశీలించి నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కె.వెంకటేశ్వరరావు, ఘంటసాలపాలెం పీహెచ్‌సీ డాక్టర్ యు.నిఖిత ప్రసాద్, డీఏ ఎన్.ఫణి కుమార్, శ్రీకాకుళం పీహెచ్‌సీ సూపర్ వైజర్ రత్నకుమారి, హెచ్‌ఏ ఏడుకొండలు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, సచివాలయాలు, పంచాయతీల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు దివ్యాంగ పింఛన్ల తనిఖీ

కోడూరు: మండలంలోని 13 పంచాయతీల పరిధిలో బుధవారం 57 దివ్యాంగ పింఛన్లను వైద్యబృందం తనిఖీ చేయనున్నట్లు ఎంపీడీఓ సుధాప్రవీణ్ మంగళవారం తెలిపారు. మండలంలో రూ.15వేలకు సంబంధించి మొత్తం75 పెన్షన్లు ఉన్నాయని, కోడూరు మినహా మిలిగిన 12 పంచాయతీల్లో ఈ తనిఖీ ఉంటుందన్నారు. పెన్షన్‌దారులు అందరూ ఇళ్ల వద్ద ఉండాలని ఎంపీడీఓ కోరారు

పాడి రైతుల సంక్షేమాభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్



పశు ఆరోగ్య శిబిరంలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

పులిగడ్డ(అవనిగడ్డ): పాడి రైతుల సంక్షేమాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. అవనిగడ్డ మండలం పులిగడ్డ రైతు సేవా కేంద్రం వద్ద పశు ఆరోగ్య శిబిరాన్ని ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పశు పోషకులతో మాట్లాడి వారి పశువుల బాగోగులను అడిగి తెలుసుకున్నారు. పశువుల ఆరోగ్యం కోసం ప్రభుత్వం చేసే కార్యక్రమాలను వివరించే వాల్‌పోస్టర్లను, కర పత్రాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. శిబిరంలో వైద్యులు 389 పశువులకు ఉచిత వైద్యసేవలు అందించారు. పశువులు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేశారు. కొన్నింటికి మశూచి వ్యాధి నివారణకు టీకాలు వేశారు. నియోజకవర్గ స్థాయి పశు వ్యాధి నిర్ధారణ శాల సిబ్బంది 60 పశువుల రక్త, పేడ, పాల నమూనాలు సేకరించి విజయవాడ ల్యాబ్‌కు తరలించారు. కార్యక్రమంలో పశు సంవర్థక శాఖ ఏడీ డాక్టర్ బొండు సాంబశివరావు, సర్పంచ్ దాసరి విజయ్‌కుమార్, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, ఉప సర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, పులిగడ్డ పశు వైద్యాధికారి డాక్టర్ ఎం.సుధారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇస్రో సందర్శన మరువలేనిది



ఇస్రో పరిశోధన కేంద్రం ఆవరణలో పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు ప్రిన్సిపాల్ మహమ్మద్ ఆసిఫ్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఇటీవల సూళ్లూరుపేటలో ఉన్న భారత అంతరిక్ష కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆ పర్యటన విశేషాలను భౌతిక శాస్త్ర అధ్యాపకుడు బి.కృష్ణారెడ్డి, విద్యార్థులు పంచుకున్నారు. తమ ఇస్రో పర్యటన ఎంతో అద్భుతంగా ఉందని తొమ్మిదవ తరగతి విద్యార్థి జె.భరత్ చైతన్య చెప్పాడు. రాకెట్లను ఎలా తయారు చేస్తారు, వాటిని ఎలా ప్రయోగిస్తారో తెలుసుకున్నామన్నారు. ఈ పర్యటనలో అంతరిక్ష కేంద్రం గురించి తాము ప్రత్యక్ష జ్ఞానాన్ని సంపాదించామని 11వ తరగతి విద్యార్థిని జి.స్వాతి పేర్కొంది. అధ్యాపకుడు కృష్ణారెడ్డి మాట్లాడుతూ భారతదేశం ప్రస్తుతం రోదసిలో ఉన్న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం తరహాలోనే 2035 నాటికి సొంతంగా అంతరిక్ష కేంద్రం (భారతీయ అంతరిక్ష స్టేషన్) నిర్మించాలన్న లక్ష్యానికి చేరువగా పయనిస్తోందన్నారు.

● **కృత్తివెన్ను:** నిర్దేశించిన లక్ష్యాలకనుగుణంగా అన్ని గ్రామాల్లో ఉపాధిహామీ పనులు జరగాలని ఏపీవో సైదారావు అన్నారు. ఆయన మంగళవారం అన్ని పంచాయతీల ఫీల్డ్ అసిస్టెంట్‌లతో టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ జాబ్‌కార్డుల వారిని గుర్తించి వారికి డిమాండ్ పెట్టాలన్నారు. కొత్త పనులకు అంచనాలు వేయించుకోవాలని, ఈ విషయంలో ఫీల్డ్ అసిస్టెంట్లందరూ శ్రద్ధ తీసుకోవాలన్నారు.